క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు


చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుమల: శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కర్ణాటక హైకోర్టు జస్టిస్ శ్రీశానంద, ప్రభుత్వ విప్‌లు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రాజు, మంత్రి గుడివాడ అమర్నాథ్, విప్ కోరుముట్ల శ్రీనివాస్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష, కర్ణాటక మంత్రి శివరాజ్ తంగడగి, ఉత్తరప్రదేశ్ మంత్రి నందగోపాల్ గుప్త, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అడిషనల్ డీజీ అనురాగ్ జార్జ్ ఉన్నారు.

టీటీడీ చైర్మన్ భూమనకు వేదపండితుల ఆశీర్వాదం



తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డికి శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారు శనివారం శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులుతో కలిసి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

హోమ్ డెకార్స్‌లో లాటెక్స్ పరుపులు



తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని హోమ్‌డెకార్స్ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకమైన లాటెక్స్ పరుపులను అందుబాటులోకి తెచ్చినట్లు అధినేత కిషోర్ తెలిపారు. హోమ్ డెకార్స్ షోరూంలో శనివారం హోమ్ డెకార్స్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లాటెక్స్ పరుపులను రబ్బరు చెట్ల నుంచి తీసిన పాల ద్వారా తయారు చేస్తారని తెలిపారు. ఇవి చల్లగా ఉండడంతో పాటు వెన్ను నొప్పి నియంత్రణకు దోహదపడతాయన్నారు. 10 నుంచి 15 ఏళ్ల వరకు మన్నిక వస్తాయన్నారు.

వ్యాఘ్రంపై ద్రౌపదీదేవి విహారం

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పులి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగె ఆలయానికి చేరుకుంది. గెరిగె నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

వర్షం.. హర్షం

తిరుపతి నగరంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. పగలు సూర్యుడి భగభగలతో ఉక్కపోతతో అల్లాడిన జనం వర్షంతో ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడడంతో హర్షం వ్యక్తం చేశారు. వాహనదారులు, ప్రజలు వర్షంలోనే తడుస్తూ ముందుకు సాగారు. కొందరు రెయిన్ కోట్లు వేసుకుని గమ్యస్థానాలకు చేరుకున్నారు. అదేవిధంగా తిరుమలలోనూ వర్షం కురిసింది. భక్తులు టవళ్లు, గొడుగుల సాయంతో షెడ్ల కిందకు పరుగులు తీశారు. వర్షంతో తిరుమలలో వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారిపోయింది.

–తిరుమల / సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


తిరుమల శ్రీవారి ఆలయం ముందు కురుస్తున్న వర్షం




తిరుపతిలో వర్షానికి గొడుగులు పట్టుకుని వెళుతున్న వాహనదారులు, తిరుమలలో షెడ్డు కింద నిలుచున్న భక్తులు

హనుమంత్‌నాయక్ మృతి పార్టీకి తీరనిలోటు


హనుమంత్‌నాయక్ పాడెను మోస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి తదితరులు

తిరుపతి మంగళం: ప్రజాసేవే పరమావధిగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే తిరుపతి 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంత్‌నాయక్ మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హనుమంత్‌నాయక్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి శనివారం తిమ్మినాయుడు పాళెం సమీపంలోని భూపాల్ లేవుట్ వద్ద ఉన్న ఆయన నివాసానికి చేరుకుని భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమంత్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే భూమన హనుమంత్‌నాయక్ దహనక్రియల్లో పాల్గొని ఆయన పాడి మోశారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, మేయర్, శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి అర్బన్: దోమకాటుతో మలేరియా, డెంగీ తదితర విష జ్వరాలు ప్రబలుతాయని, అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఆయన శనివారం తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి, జేసీ డీకే బాలాజీ, నగరపాలక కమిషనర్ హరిత, డీఎంహెచ్‌వో శ్రీహరితో కలిసి కలెక్టరేట్‌లో ప్రపంచ దోమల నివారణ దినోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి, జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, డీపీఎం వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి, టీటీడీ చైర్మన్ భూమన

అభివృద్ధి పనులు వేగవంతం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె శనివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డితో కలిసి అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. డిప్యూటీ మేయర్ భుమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ప్రతిపాదించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. పనుల్లో నాణ్యత లోపించినా, సమయానికి పూర్తి చేయకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర బ్యూటిఫికేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులు, ఏసీపీ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

నిరుద్యోగ భారతం కాదు.. ఉద్యోగ భారతం కావాలి

- దర్శక, నిర్మాత ఆర్.నారాయణ మూర్తి

తిరుపతి సిటీ : దేశంలోని యువత నిరుద్యోగం భారతాన్ని కాకుండా ఉద్యోగ భారతం కోసం ఎదురుచూస్తున్నారని విప్లవ హీరో, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి తెలిపారు. ఆయన స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించిన యూనివర్సిటీ సినిమా ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యావ్యవస్థ ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల్లో నలిగిపోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో కోట్లాది ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాటతప్పడం సరికాదన్నారు. పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీ, అవినీతి ఎక్కువైందని, దీంతో పేద విద్యార్థులు పోటీని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య కార్పొరేటీకరణతో అర్హతలేని వారు అధికారులుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లు అవుతున్నారని, తద్వారా సమాజం సమాజం ప్రమాదంలో పడుతోందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అంశాలుగా యూనివర్సిటీ సినిమాను తెరకు ఎక్కించినట్టు వివరించారు. అనంతరం విద్యావిధానం, నిరుద్యోగ సమస్యలపై విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.


మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

శ్రీలలితా త్రిపుర సుందరిని దర్శించుకున్న చెవిరెడ్డి లక్ష్మి



చంద్రగిరి: మండలంలోని తొర్నకంబాల పంచాయతీలోని శ్రీలలితా పీఠంలో వెలసిన శ్రీలలితా త్రిపుర సుందరి అమ్మవారిని ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు స్థానిక సర్పంచ్ గౌతమి, పంచాయతీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి స్వాగతం పలికారు. ఉప సర్పంచ్ మురళిరెడ్డి, మాజీ సర్పంచ్ మురగయ్య, మాజీ ఎంపీపీ కుసుమ కుమారి, వెంకటేష్, చిరంజీవిరెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, ఆలయ నిర్వాహకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘటనకు సజీవ సాక్ష్యం ఛాయా చిత్రం

తిరుపతి కల్చరల్: చరిత్రలో అనేక సంఘటనలకు సజీవ సాక్ష్యం ఛాయా చిత్రాలని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ప్రపంచ ఛాయా చిత్ర దినోత్సవం సందర్భంగా శనివారం ఏపీ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా శాఖ, తిరుపతి ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా ప్రెస్‌క్లబ్‌లో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో టీటీడీ చైర్మన్ భూమన ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వార్తలో కొంత విభేదం ఉన్నప్పటికీ ఛాయా చిత్రాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ విభేదించలేమన్నారు. ఆయనను అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు సత్కరించారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాధాక్రిష్ణ, లావణ్యకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.గిరిబాబు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, సీనియర్ పాత్రికేయుడు ఆర్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం

తిరుపతి ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం లీలామహల్ సర్కిల్‌లో ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ పితామహుడు లూయిస్ జాక్వెస్ మండే డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య నాయుడు, మాజీ అధ్యక్షుడు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు దొరబాబు, సంయుక్త కార్యదర్శి ఉమామహేశ్వర్, మునికేశవులు, నీలకంఠేశ్వరరావు, వినోద్ పాల్గొన్నారు.

వైభవంగా మునీశ్వర ఆలయ కుంభాభిషేకం


మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ధర్మకర్తలు

తిరుపతి రూరల్: మండలంలోని వేదాతంపురంలో కొలువుదీరిన అక్కగార్లు, మునీశ్వర ఆలయంలో శనివారం కుంభాభిషేకాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అంతకుముందు ఆలయం ముందు గోమాతకు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు నాగరాజరెడ్డి, రవిరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

ఏర్పేడు: స్థానిక సచివాలయ పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లకు శనివారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య గుర్తింపు కార్డులు అందజేశారు. ఏర్పేడు సచివాలయ పరిధిలో 14 మంది గ్రీన్ అంబాసిడర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

అలరించిన అన్నమయ్య పద నృత్యార్చన

తిరుపతి కల్చరల్: ప్రైడ్ ఇండియా కల్చరల్, సిటిజెన్ వెల్ఫేర్ ఫోరం సంయుక్తంగా శనివారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి అన్నమయ్య పద నృత్యార్చన అలరించింది. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఎస్వీ సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రభావతి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి దర్పణం పట్టే కళలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సి అవసరం ఉందన్నారు. అనంతరం ప్రైడ్ ఇండియా కల్చరల్ సీఈవో కోల వెంకటేశ్వరరావు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు, నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. రచయిత దొరైరాజు, విశ్రాంత పోలీసు అధికారి అభిషేకం, డాక్టర్ అనురాధ రాయ్, కాసుల విష్ణు ఆచార్య, సాయి రితీష్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఫుడ్‌ఫెస్ట్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లయిడ్ మైక్రోబయాలజీ, ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాల ఆధ్వర్యంలో శనివారం ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించారు. వర్సిటీ డీన్‌లు, అధ్యాపకులు హాజరై విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహార భద్రత, నాణ్యత, నిర్వహణ ప్రధానాంశాలుగా ప్రోబయోటిక్స్ ప్రభావం, బ్యాక్టీరియా ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యాక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యాపకులు తెలిపారు. ఫుడ్ ఫెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పదార్థాలను బోధన, బోధనేతర సిబ్బంది కొనుగోలు చేశారు.

డ్రైవెన్ ఇన్నోవేషన్ సదస్సు

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ సంయుక్తంగా బ్యాంకింగ్, హెల్త్‌కేర్, పారిశ్రామిక అవకాశాల కోసం డ్రైవెన్ ఇన్నోవేషన్ అనే అంశంపై సావేరి సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహిచారు. ఇందులో ముఖ్య అతిథిగా వీసీ భారతి పాల్గొన్నారు. కార్యక్రమంలో పెప్సికో డైరెక్టర్ డాక్టర్ సచిన్ కుమార్, ఇన్నోవేషన్ అంబాసిడర్ డాక్టర్ శివపార్వతి పాల్గొన్నారు.


ఫుడ్ ఫెస్ట్‌ను పరిశీలిస్తున్న అధ్యాపకులు, ఉద్యోగులు

మురుగు కాలువలో దిగి నిరసన

చంద్రగిరి: మురుగు కాలువను శుభ్రం చేయాలని కోరుతూ వెంకటంపేటలో గ్రామస్తులు శనివారం కాలువలో దిగి వినూత్నంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వెంకటంపేటలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ లేకుండా కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలువలో మట్టి వేసి పూడ్చివేస్తామని హెచ్చరించారు.

జీఓ 117ను రద్దు చేయాలని వినతి

తిరుపతి ఎడ్యుకేషన్: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను రద్దు చేయాలని ఆపస్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజి, జి.సాంబిరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీఓ 117తో పని సర్దుబాటు చేయడం తగదని, ఇప్పటికే వారానికి 40 పీరియడ్లు బోధిస్తూ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో 24 నుంచి 30 పీరియడ్లు బోధించేవారని, మిగిలిన పీరియడ్లను పాఠ్య ప్రణాళికల తయారీ, టీఎల్‌ఎం తయారీకి ఉపయోగించుకునేవారని పేర్కొన్నారు. సత్వరమే జీఓ 117ను ఉపసంహరించుకోవాలని కోరారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం సర్వాంకారభూషితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆసీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

నేవీ జాబ్స్‌లో ఎస్వీ డిఫెన్స్ విజయ కేతనం


ఉద్యోగాలకు ఎంపికైన వారితో శేషారెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు నేవీ అగ్నివీర్ ఉద్యోగాల్లో విజయ కేతనం ఎగురవేశారు. జూన్‌లో జరిగిన నేవీ అగ్నివీర్ సెలక్షన్స్‌లో అకాడమీకి చెందిన 52 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ శేషారెడ్డి తెలిపారు.